## క్లుప్తంగా

### వరికుప్ప దగ్ధం

గూడూరు: మండలంలోని కప్పలదొడ్డి గ్రామంలో సోమవారం వరికుప్ప దగ్ధం అయింది. రబీలో అపరాలు సాగు చేయడంతో గ్రామానికి చెందిన గూడూరు వరప్రసాద్‌కు చెందిన ఖరీఫ్ వరికుప్ప ఇంకా నూర్చకుండా పొలంలోనే ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం పొలాల్లోని చెత్తను తగలబెడ్తున్న సమయంలో రేగిన నిప్పురవ్వలు కుప్పపై పడి మంటలు రేగాయి. ఎండ బాగా కాస్తుండటంతో మంటలను గుర్తించి ఆర్పే లోపే వరికుప్ప అంతా అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో ఆరుగాలం శ్రమించి పండించిన పంటంతా కాలిబూడిదైందని రైతు వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు.

### పెదప్రోలులో ఎమ్మెల్యే కుమారుడు, కుమార్తె ప్రచారం



పెదప్రోలు(మోపిదేవి): మండల పరిధిలోని పెదప్రోలు గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. అవనిగడ్డ శాసన సభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు తనయుడు వికాస్‌బాబు, కుమార్తె నిశ్చల సోమవారం ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేసి ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌బాబు, మచిలీపట్నం ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరావుకు రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, గ్రామ పార్టీ కన్వీనర్ జన్యావుల రామమోహనరావు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, రవికాంత్ యాదవ్, పీఏసీఎస్ చైర్పర్సన్‌లు ఆది రాంబాబు, రావి రామ్‌ప్రసాద్, రెడ్రౌతు వెంకట రమణ, తుటారం కృష్ణ, గరికిపాటి గోవిందరాజులు, సతీష్‌బాబు, సచివాలయ మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు, అరజా వెంకట చలపతిరావు, లింగం జగదీష్‌కుమార్, గండు దుర్గారావు, బచ్చు దిలీప్, ఆకుల వెంకట్రామయ్య, కందుల నాగభూషణం, రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

### లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా పింఛన్లు పంపిణీ చేయాలి

ఘంటసాల: పింఛను కోసం వచ్చే అవ్వాతాతలకు, విభిన్న ప్రతిభావంతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పంపిణీ చేయడంతో పాటు వారికి సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో బి.మారుతి శేషమాంబ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. ఘంటసాల గ్రామ సచివాలయాలు 1,2 పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులతో ఫించన్ల పంపిణీ నిమిత్తం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శేషమాంబ మాట్లాడుతూ పింఛనుదారుల సంఖ్యను బట్టి సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వచ్చిన వారిని తక్షణమే పంపించేలా చూడాలన్నారు. ఉదయం 6.30 గంటల నుంచి ఫించన్లు ఇచ్చి, ఎండ సమయంలో ఆపి, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పంపిణీ చేయాలన్నారు. సచివాలయం వద్ద తాగునీటి సౌకర్యం, ఏఎన్ఎంల ద్వారా ఓఆర్ఎస్ నీటిని సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో మండల పరిషత్ పరిపాలనాధికారి కేజే శ్రీనివాసచంద్, ఈఓపీఆర్డీ గుత్తికొండ కిషోర్, పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఇఫ్తార్ విందులో పేర్ని కిట్టు



మచిలీపట్నంటౌన్: నగరంలోని అరుణోదయ కాలనీ మసీదులో సోమవారం జరిగిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. ఈ విందులో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, మార్కెట్ యార్డు డైరెక్టర్ మొహిసిన్, 8వ డివిజన్ కార్పొరేటర్ శ్రీరాం చిన్నా, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నాయకులు మొహమ్మద్ రఫీ, షేక్ బాషా, బాషు, రబ్బానీ, మసీదు కమిటీ అధ్యక్షుడు బారీ, కార్యదర్శి సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

### 'నవోదయ'లో ప్రవేశానికి హర్షిత ఎంపిక



గూడూరు: జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తుమ్మలపాలెం విద్యార్థిని జడ హర్షిత 6వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించింది. ఈ సందర్భంగా హర్షితను ప్రధానోపాధ్యాయురాలు ఉండి రాణి అభినందించారు.

### సప్తగిరి బ్యాంకులో డిజిటల్ సేవలు ప్రారంభం

చల్లపల్లి: సప్తగిరి గ్రామీణ బ్యాంకులో డిజిటల్ సేవలు ప్రారంభించినట్లు స్థానిక సప్తగిరి బ్యాంక్ బీఎం పి.రమేష్ తెలిపారు. బ్యాంకు సేవల గురించి సోమవారం మైక్ ప్రచారం ప్రారంభించారు. వినియోగదారులకు తమ బ్యాంకులో మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్, యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు.

# మీ బిడ్డగా ఆశీర్వదించండి

- ఫ్యాను గుర్తుకు ఓటు వేసి నాకు అవకాశం కల్పించండి
- ప్రజాదీవెన కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము
- భర్తను గెలిపించాలంటూ జెడ్పీ చైర్‌పర్సన్ హారిక ప్రచారం



గడపగడపకు ప్రచారంలో భాగంగా ఫ్యాను గుర్తుకు ఓటేయాలని కోరుతున్న వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము)

పెడన: మీ బిడ్డగా ఆశీర్వదించి ఓటువేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించి అక్కున చేర్చుకోవాలని పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. ఆయన పెడన పట్టణంలోని 6, 7, 8 వార్డులలో సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి గడపగడపకు తిరుగుతూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. తొలుత జోగానందనరావు కాలనీలోని వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పిమ్మట ప్రజాదీవెన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒక పక్క రాము, మరోపక్క హారిక విస్తృతంగా పర్యటిస్తూ ఓట్లను అభ్యర్థించారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించి ఎవరి పరిపాలన బాగుందో గమనించాలన్నారు. ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నేతన్న నేస్తం ద్వారా నేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు చొప్పున ఐదేళ్లు రూ.1.20 వేలు అందించారనే విషయాన్ని మరచిపోవద్దన్నారు. ప్రస్తుతం పింఛన్లు సచివాలయాలకు వెళ్లి తీసుకునే దుస్థితి టీడీపీ తీసుకువచ్చిందని, ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే ఉండాలని, ఈ విషయాన్ని గమనించి ఓటు వేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్ల మంచి జరిగిందని భావిస్తే తప్పకుండా ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కటకం ప్రసాద్, గరికిముక్కు చంద్రబాబు, పిచ్చిక సతీష్‌బాబు, శిరివెళ్ల జయేష్, మెట్ల గోపి, బళ్ల గంగయ్య, కో ఆప్షన్ సభ్యులు వీరంకి నరసింహారావు, మున్నా, పట్టణ కన్వీనర్ బండారు మల్లి, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

### అక్కా...పెద్దమ్మా..బాబాయ్...తాతా అంటూ ఆప్యాయంగా పలుకరిస్తున్న హారిక...



ఆప్యాయంగా పలుకరించి ఓట్లను అభ్యర్థిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

ఆయా వార్డులలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పర్యటిస్తూ ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరుతూ ముందుకు సాగుతున్నారు. అక్కా, పెద్దమ్మా, బాబాయ్, తాత గారు అంటూ అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ తన భర్త రమేష్(రాము) ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని, ఆయన్ను గెలిపించాలని విజ్ఞప్తిచేస్తున్నారు. ఆమె వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, కౌన్సిలర్లు కొసనం కరుణకుమారి, రహమతున్నీసా, మహిళా నాయకులు నాగమణి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ఆయురారోగ్యాలతో నిండునూరేళ్లు జీవించాలి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



రావివారిపాలెంలో వెంకట్రామయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి దంపతులు

రావివారిపాలెం(మోపిదేవి): మాజీ ఉప సర్పంచ్ రావి వెంకట్రామయ్య ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు ఆకాంక్షించారు. మాజీ ఉప సర్పంచ్ రావి వెంకట్రామయ్య నూతన గృహ ప్రవేశం అనంతరం 96వ జన్మదిన వేడుకలు ఆయన ఇంటి వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని వెంకట్రామయ్యకు నూతన వస్త్రాలు అందించి పూలదండలతో ఘనంగా సత్కరించారు. నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం వెంకట్రామయ్య సింహాద్రి దంపతులను ఆశీర్వదించారు. మాజీ సర్పంచ్‌లు రావి పెద బాబూరావు, రావి నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రావి రామ్ ప్రసాద్, పర్చూరి అంజయ్య, కావూరి కోదండరామయ్య, రావి ప్రభుదాస్, డాక్టర్ రావి శ్రీనివాసరావు, కంఠంనేని కుటుంబరావు సన్మాన గ్రహీత వెంకట్రామయ్య కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక శోభతో ఉట్టిపడిన లింగారెడ్డిపాలెం

- కనులపండువగా వేళ్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ
- ప్రతిష్ఠోత్సవాల్లో వేలాదిగా పాల్గొన్న భక్తజనం
- పూజల్లో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి చంద్రశేఖర్, ఎమ్మెల్యే రమేష్‌బాబు



ఆలయంలో ప్రతిష్ఠించిన వేళ్లమ్మ అమ్మవారు

కోడూరు: వేదపండితులు మంత్రోచ్ఛరణలు.. డప్పు వాయిద్యాల మేళతాళాలు.. భక్తుల జయజయధ్వానాల నడుమ వేళ్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సోమవారం ఉదయం 7.59 గంటలకు అమ్మవారి విగ్రహాన్ని కనులపండువగా ప్రతిష్ఠించారు. ఆలయ గోపుర శిఖర ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గణపతి, పోతురాజు శిలల ప్రతిష్ఠను భక్తిప్రపత్తులతో జరిపారు. ప్రతిష్ఠోత్సవాలను తిలకించేందుకు భక్తజనం వేలాది తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. మచిలీపట్నంకు చెందిన రాళ్లపల్లి ఆంజనేయశాస్త్రిశర్మ, మందపాకలకు చెందిన కాశీభొట్ల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో పది మంది రుత్వికులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా యాగశాలలో కల్యాణకర్తలతో పూర్ణాహుతి నిర్వహించారు.

**స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు**

ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన అమ్మవారిని వైఎస్సార్‌సీపీ బందరు పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు దర్శించుకున్నారు. ఆలయ నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. పండితులు చంద్రశేఖర్, రమేష్‌బాబులను శేషవస్త్రాలతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యన్నారాయణ, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. ప్రతిష్ఠను పురస్కరించుకుని గ్రామస్తుల సహకారంతో ఎనిమిది వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తమండళ్ల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### ఉచిత మజ్జిగ పంపిణీ ప్రారంభం

చల్లపల్లి: వాసవీ క్లబ్ ఆఫ్ చల్లపల్లి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. స్థానిక పోలీస్ స్టేషన్ రోడ్డు సెంటరులో శిబిరాన్ని క్లబ్ అధ్యక్షురాలు మాజేటి అమరవాణి ప్రారంభించారు. వేసవి దృష్ట్యా రెండు నెలలు ఈ ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం దాతల సహాయంతో ప్రతి రోజూ నిర్వహిస్తామని తెలిపారు.

### గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాల కవాతు



భావదేవరపల్లి(నాగాయలంక): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో నాగాయలంక మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల విధులకు వచ్చిన కేంద్ర పోలీసు బలగాలతో కలసి సబ్ డివిజన్ పోలీసులు సోమవారం కవాతు(ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామమైన భావదేవరపల్లిలో తొలుత జిల్లా అదనపు ఎస్పీ ఎస్‌డీవీ ప్రసాద్ అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ నేతృత్వంలో ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం ప్రారంభించారు. తదుపరి గ్రామంలోని ప్రధాన వీధులలో కవాతు జరిపారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి భయాలకు తావులేకుండా ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని, భద్రతగా తాము ఉంటామనే భరోసా కల్పించడానికే పోలీసు బలగాలతో మార్చ్‌పాస్ట్ నిర్వహించామని అదనపు ఎస్పీ ప్రసాద్ వెల్లడించారు. ఇది ఎన్నికల ప్రక్రియలో ఒక భాగమని, అలాగే పోలింగ్ ముగిసే వరకు పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా సహకరించాలని డీఎస్పీ కోరారు. అనంతరం చోడవరం (సమస్యాత్మక గ్రామం), రాజకీయ సెన్సిటివ్ గ్రామాలైన పెదపాలెం, బిల్లీగ్రాహం నగర్, అంబేద్కర్ నగర్ కాలనీ, నాగాయలంక మెయిన్ సెంటర్‌లలో(మొత్తం 7.25కి.మీ) కవాతు జరిపారు. అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు పి.వి.త్రినాథ్, నాగప్రసాద్, నాగాయలంక ఎస్.ఐ ఎం.సుబ్రహ్మణ్యం, కోడూరు ఎస్ఐ పి.శిరీష ఏఎస్ఐలు, వీఆర్వోలు, స్థానిక కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

### పింఛనుదారులను ఇబ్బందులు పెడుతున్న ప్రతిపక్షాలు : కిట్టు

మచిలీపట్నంటౌన్: టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పింఛనుదారులను ఇబ్బందులు పెట్టేందుకు పూనుకోవటం విచారకరమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 20వ డివిజన్‌లో సోమవారం గడపగడపకు సంక్షేమం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ డివిజన్ కార్పొరేటర్ తిరుమలశెట్టి వరప్రసాద్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ వలంటీర్ల వ్యవస్థపై మొదటి నుంచి విషం కక్కుతున్నారన్నారు. ప్రస్తుతం వారి అనుచరుడైన నిమ్మగడ్డ ప్రసాద్ తో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి ఈ నెల నుంచి పింఛన్లు వలంటీర్లు ఇవ్వకుండా ఆదేశాలు ఇప్పించారన్నారు. దీంతో ఇంటి నుంచి బయటకు రాలేని వికలాంగులు, వృద్ధులు సచివాలయానికి వచ్చి పింఛను తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ని ఎన్నుకుంటేనే పథకాలన్నీ సక్రమంగా అమలవుతాయన్నారు. కార్యక్రమంలో ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నడవలేం..ఎక్కలేం..తెచ్చుకోలేం..

- పింఛను ఇంటికి వచ్చి ఇస్తే బాగుండు
- వృద్ధులు..దివ్యాంగ లబ్ధిదారుల ఆవేదన

ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీరు వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు సేవ చేస్తుంటే గిట్టని వారు కుట్రలు చేసి వలంటీర్లను రాకుండా అడ్డుకున్నారని వృద్ధులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి ఆవేదన వారి మాటల్లోనే... -సాక్షి నెట్‌వర్క్

### అంత దూరం నడిచి వెళ్లలేం...



నా వయస్సు 85 సంవత్సరాలు. అంత దూరం వెళ్లి పింఛను తెచ్చుకోవాలంటే నడవలేను. ఆటో పెట్టి తీసుకువెళ్లినా అక్కడ వేచి ఉండాలి. గతంలో అవస్థలు పడ్డాం. మా బాధలు అర్థం చేసుకున్న జగన్‌బాబు పింఛను ఇంటికి తీసుకువచ్చి ఇచ్చేలా వలంటీర్లను ఏర్పాటు చేశారు. ఇప్పుడు మళ్లీ పాత రోజులు గుర్తుకు తెస్తారేమోనని భయమేస్తోంది. అసలే ఎండలు మండుతున్నాయి. మా లాంటి వయస్సు మళ్లిన వాళ్లను ఆ దేవుడే కాపాడాలి.

– యర్రా సూర్యాకాంతం, 9వ వార్డు, వృద్ధాప్య పింఛను లబ్ధిదారు, పెడన

### టీడీపీ వారికి పింఛన్‌దారుల ఉసురు తగులుతుంది



నాకు 80 శాతం అంగవైకల్యం ఉంది. గత అయిదేళ్లుగా వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్లు ఇస్తుంటే ఎటువంటి ఇబ్బందులు లేకుండా హాయిగా ఉన్నాం. ఎన్నికల కమిషన్‌కు టీడీపీ వారు ఫిర్యాదులు చేసి వలంటీర్లను మా వద్దకు రాకుండా చేశారు. టీడీపీ వారికి పింఛనుదారుల ఉసురు తగులుతుంది.

-వీరంకి వర్ధీకాసులు, జానకీరామపురం, బంటుమిల్లి మండలం

### మాకు పింఛన్లు ఎవరిస్తారు సామీ...



తెల్లవారుజామునే వలంటీర్ వచ్చి తలుపు తట్టి పింఛను ఇచ్చేవారు. ఇప్పుడు మేమే సచివాలయంకు వెళ్లి తీసుకోవాలంటే ఎలా... నేను నడవలేను. రాజకీయాల కోసం మాలాంటి వారిని ఇబ్బందులు పెడతారా?

-దిరిశం వజ్రమ్మ, వృద్ధురాలు, ఘంటసాల

### ఎన్నికల కమిషన్ పునరాలోచన చేయాలి

అసలే ఎండలు మండుతున్నాయి. కర్ర సహాయం లేకుండా అడుగు ముందుకు వేయలేను. సచివాలయం, పంచాయతీల దగ్గరకు అంటే పాతరోజులు గుర్తుకు వచ్చి భయమేస్తోంది. ఇప్పటికైనా పునరాలోచన చేసి వలంటీర్ల ద్వారా అందించేలా చూడాలి

-మట్టా సాయి, వృద్ధుడు, ఘంటసాల

### నేను మంచంమీద నుంచి కదల్లేను...ఇప్పుడెలా?

రాజకీయాల కోసం మాలాంటి వారికి వలంటీర్ల ద్వారా అందించే పింఛన్ నిలిపివేయడం తప్పు. నేను మంచంలో నుంచి కదల్లేను, సచివాలయం దగ్గరకు వెళ్లి పింఛన్ ఎలా తెచ్చుకోవాలి. ప్రతిపక్ష పార్టీల వాళ్లు మమ్మల్ని ఇబ్బందులు పెట్టేందుకే ఈసీతో ఇలా చేయించారు. గతంలో పడ్డ కష్టాలు కళ్ల ముందు కనపడుతుంటే భయమేస్తోంది.

-కొడాలి కౌశలమ్మ, దేవరకోట

### మంచి చేస్తున్న వారికి అడ్డంకులు సృష్టిస్తున్నారు



నాకు వృద్ధాప్య పింఛను వస్తోంది. ఇప్పుడు సచివాలయానికి వెళ్లి పింఛను తీసుకోవాలంటున్నారు. మంచి చేస్తున్న జగన్ బాబుకు అడ్డంకులు సృష్టిస్తూ మావంటి వృద్ధులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. చాలా దారుణం. జగన్‌బాబుకు మంచి జరగాలి. ఆయనే మా బాధలను అర్థం చేసుకుని పింఛను ఇంటికి పంపిస్తారు.

– నల్ల వీరమృత్యుంజయరావు, మొగ్గయ్యకాలనీ, పెడన

### సచివాలయంలో కాకుండా ఏదైనా ఒక చోట ఇచ్చేలా..



నాకు వికలాంగుల పింఛను వస్తోంది. సచివాలయానికి వెళ్లి తెచ్చుకోవాలంటే కష్టం. సచివాలయాల్లో కాకుండా వార్డులో ఏదైనా ఒక చోట పింఛన్లు ఇచ్చేలా ఏర్పాటుచేస్తే బాగుంటుంది. కొన్ని సచివాలయాలు పై అంతస్తుల్లో ఉన్నాయి. దివ్యాంగులు, వృద్ధులు వెళ్లి పింఛను తెచ్చుకోవడం చాలా ఇబ్బంది అవుతుంది. ఎన్నికల సంఘం పునరాలోచన చేయాలి.

– భోగాది కమలప్రసాద్, వైఎస్సార్ కాలనీ, 11వ వార్డు, పెడన

### ఈ వయసులో ఎలా వెళ్లాలయ్యా



చంద్రబాబు రాజకీయ కుట్రతో గ్రామ వలంటీర్లను మా ఇళ్లకు రాకుండా చేశారు. నా వయసు 92 సంవత్సరాలు. ఈ వయసులో పింఛన్ కోసం కార్యాలయం వరకు ఎలా వెళ్లాలయ్యా? వలంటీర్లు ఉంటే ఒకటో తేదీ ఇంటికి వచ్చి ఇచ్చే వాళ్లు. చంద్రబాబు రాజకీయంతో మాకు సకాలంలో పింఛన్ రాలేదు.

-తుమ్మా గోపాలస్వామి, మంగళాపురం

### పెద్ద బిడ్డలా ఇంటికి పంపేవాడు



జగన్‌మోహన్ రెడ్డి గ్రామ వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీ రాగానే పెద్దబిడ్డ లాగా పింఛన్ డబ్బులు ఇంటికి పంపించేవాడు. చంద్రబాబు పాలనలో పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు పడేవాళ్లం. చంద్రబాబు చేసిన కుట్రతో మళ్లీ మేము గ్రామ సచివాలయం వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి వచ్చింది.

-దేవు శ్రీరావమ్మ, మంగళాపురం

### చంద్రబాబుకు వలంటీర్లపై కోపం ఎందుకు?



చంద్రబాబుకు గ్రామ వలంటీర్లపై కోపం ఎందుకు? మాకు ఒకటో తేదీ పింఛన్లు ఇంటికి తెచ్చి ఇస్తుంటే వాళ్లను మా ఇళ్లకు రాకుండా అడ్డం కొట్టాడు. నా వయసు 72 సంవత్సరాలు. ఈ వయసులో గ్రామ సచివాలయం వరకు వెళ్లి పడిగాపులు పడి పింఛన్ డబ్బులు తెచ్చుకోవాలంటే చాలా ఇబ్బంది.

-తుమ్మా వెంకటరత్నం, మంగళాపురం, చల్లపల్లి మండలం


### పక్షవాతంతో నేనెలా వెళ్లేది...




నాకు 80 ఏళ్లు. పైగా పక్షవాతం. మంచానికే పరిమితమయ్యా. నేను సచివాలయానికి వెళ్లి పింఛను తీసుకోలేను. ఇప్పుడు నాకు పింఛను వస్తుందా లేదా అని భయంగా ఉంది. పింఛను డబ్బులు ఇస్తేనే నేను మందులు కొనుక్కోవాలి.

-గూటాల వెంకటేశ్వర్లు, మద్దేటిపల్లి, బంటుమిల్లి మండలం

## వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



రాజీనామా చేసేందుకు వచ్చిన వలంటీర్లతో కిక్కిరిసిన కమిషనర్ చాంబర్



బందరు ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

- నగరంలో 578 మంది వలంటీర్లు రాజీనామా
- కమిషనర్‌కు పత్రాలు అందజేత

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో పనిచేస్తున్న వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలకు తెరలేపారు. ప్రతిపక్ష టీడీపీ నేత చంద్రబాబు, జనసేన నేత పవన్‌కళ్యాణ్ కొన్నాళ్లుగా వలంటీర్లపై చేస్తున్న ఆరోపణలతో పాటు పింఛన్ల పంపిణీకి వినియోగించొద్దంటూ ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ఆదేశాలతో మనస్తాపానికి గురైన వలంటీర్లు సోమవారం మూకుమ్మడి రాజీనామాలకు పూనుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వలంటీర్లు రాజీనామా పత్రాలను పట్టుకుని మునిసిపల్ కార్యాలయానికి రావటంతో కార్యాలయం కిటకిటలాడింది. నగరంలో మొత్తం 823 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వీరిలో దాదాపు 578 మంది వలంటీర్లు తమ రాజీనామా లేఖలను కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజుకు అందజేశారు. రాజీనామా మీరే ఇస్తున్నారా, ఎవరి ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా అని ఆయన వలంటీర్లను ప్రశ్నిస్తూ రాజీనామా పత్రాలు స్వీకరించారు. తమపై ఎలాంటి ఒత్తిళ్లు లేవని, తామే మనస్తాపానికి గురై రాజీనామా చేస్తున్నామని వలంటీర్లు ఆయనకు బదులిచ్చారు.

**మచిలీపట్నం ఎంపీడీఓకు రాజీనామాలు సమర్పించిన వలంటీర్లు**

కోనేరుసెంటర్: బందరు మండలంలో గ్రామ వలంటీర్లు సోమవారం మూకుమ్మడి రాజీనామాలకు పూనుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం వలంటీర్లను సేవలకు దూరంగా పెడుతూ ఆదేశాలు జారీ చేయడంతో మనస్తాపానికి గురైన వలంటీర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. మండలంలో 410 మంది వలంటీర్లకు గాను సోమవారం సుమారు రెండు వందల మందికి పైగా వలంటీర్లు ఎంపీడీవో బాలకృష్ణ రావుకు స్వయంగా రాజీనామాలు అందజేశారు. గడచిన ఐదేళ్లుగా తమకు జీవనోపాధి కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలబడి పార్టీ పరంగా తమ సేవలను స్వచ్ఛందంగా అందజేస్తామంటూ బహిరంగంగా చెబుతున్నారు.

### పోస్టల్ బ్యాలెట్ నిర్వహణపై జాగ్రత్త వహించాలి



చిలకలపూడి(మచిలీపట్నం): పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి అధికారులు జాగ్రత్తగా తమ బాధ్యతలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ఆయన సోమవారం జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, పోలీసులు, అత్యవసర సేవలు అందించే వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాలు కల్పించాలన్నారు. అందుకు అవసరమైన కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై సీఈవో మీనా పలు సూచనలు చేశారు. అనంతరం నిర్వహించాల్సిన విధులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రాజాబాబు, డీఆర్వో చంద్రశేఖరరావు, ఏఎస్పీ వెంకటేశ్వరరావు, మచిలీపట్నం, పెడన, పెనమలూరు, గుడివాడ, అవనిగడ్డ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎం.వాణి, పి.వెంకటరమణ, డి.రాజు, పి.పద్మావతి, బాలసుబ్రమణ్యం, పలువురు నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## కృష్ణా వర్సిటీలో జాతీయ పతాక ఆవిర్భావ దినోత్సవం

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ స్మారక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కె.హెచ్.ఎస్. జగదాంబ సహకారంతో సోమవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జాతీయ పతాక ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉప కులపతి ఆచార్య జి.జ్ఞానమణి మాట్లాడుతూ జాతీయ పతాకాన్ని రూపొందించిన వ్యక్తి మచిలీపట్నంకు దగ్గరలోని భట్లపెనుమర్రు వాసి పింగళి వెంకయ్య కావడం మనందరికీ గర్వకారణం అన్నారు. జాతీయ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించిన ఎన్‌సీసీ విద్యార్థులను, యూనివర్సిటీ ఎన్‌సీసీ విభాగం అధికారి డాక్టర్ డి.రామ శేఖర రెడ్డిని వైస్ చాన్సలర్ జ్ఞానమణి అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ శోభన్ బాబు, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. విజయకుమారి పాల్గొన్నారు.